17వ
నిత్య దినపత్రిక
సూర్య
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం,31 డిశంబర్ 2023

వైసీపీ మునిగిపోయే నావ

– మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మీ సత్తిబాబు

కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ : రాష్ట్రంలో వైసీపీ మునిగిపోయే నావ అని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. మనందరం కలవాలి – చంద్రన్నకు అండగా నిలవాలి–తటస్థులతో మీ అనంతలక్ష్మి కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని తూరంగి, రాయుడుపాలెం గ్రామాల్లో శనివారం వారు తటస్థుల ఇంటింటికి తిరిగి మిని మానిఫెస్టో ప్రతులను అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మీ సత్తిబాబు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని, అక్రమాలు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని ఆరోపించారు. అధికార వైసీపీ ప్రభుత్వం ఒక్క అవకాశం అంటూ అధికారం చేపట్టి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని, అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చిందని ఆరోపించారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపి నాలుగున్నరేళ్లలో ఒక్క జాబ్ క్యాలెండర్ విడుదల చేయక నిరుద్యోగులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇసుక మాఫియాతో రహదారులు వాటి రూపాలే మారిపోయాయన్నారు. ప్రజల మద్దతుతో టీడీపీ, జనసేనల ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమన్నారు.ఈ కార్యక్రమంలో కరప మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ మిరపల సూర్య ప్రకాష్, తూరంగి గ్రామ కమిటీ అధ్యక్షులు జక్కే అప్పన్న, కాకినాడ రూరల్ కొప్పుల వెలమ సంఘం అధ్యక్షులు యాసలపు కన్నబాబు పార్టీ నాయకులు గురి గణేష్ కుమార్, శర్మ, గరికిన పెద్ద రాజు, జామి సత్తిరాజు, దొమ్మేటి వెంకటరమణ, పెమ్మాడి శ్రీను, బొజ్జ భవాని సాంబశివరావు, పలివెల గాయత్రి, గుత్తుల లక్ష్మి, పడమటి వీరబాబు, కొమిరిశెట్టి నర్సింగరావు, చల్మాజీ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన విజయవంతం చేయాలి

– అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో సమగ్రంగా చేపట్టాలి

– జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా

కాకినాడ, మేజర్ న్యూస్ : పెన్షన్ పెంపు కార్యక్రమంలో భాగంగా జనవరి 3న కాకినాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో సమగ్రంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన 2024–జనవరి 3న వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపు కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనకు చేపట్టవలసిన చర్యలపై ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయకర్త తలశిల రఘురాం, కాకినాడ ఎంపి వంగా గీత, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎస్పీ ఎస్ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ప్రజలు, లబ్ధిదారులు తరలి వచ్చేందుకు అవసరమైన రవాణా వాహనాలను ఏర్పాటు చేయాలని డీటీసీని ఆదేశించారు. వాహనాల రూట్లు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బందోస్తు ఏర్పాటలను పోలీస్ శాఖకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనలో రోడ్ షో, బహిరంగ సభల వద్ద పటిష్టమైన బారికేడింగ్ ఏర్పాటుకు రోడ్లు భవనాల ఎస్ఈ ని ఆదేశించారు. హెలిపాడ్, రోడ్ షో, బహిరంగ సభల వద్ద అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు, కాన్వాయ్ లో వైద్యాధికారులతో కూడిన అంబులెన్స్ ఏర్పాటు చేయాని డీఎం అండ్ హెచ్వో కు సూచించారు. బహిరంగ సభ నిర్వహణకు వేదిక, సభాప్రాంగణం ఏర్పాట్లను పెద్దాపురం ఆర్డీవో చేపట్టాలని కోరారు. అలాగే సభాప్రాంగణంకు హాజరైన ప్రజలకు ఆహారం, త్రాగునీరు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహణ, టెంపరరీ టాయిలెట్లు కూడా ఏర్పాటు చేయాలని కాకినాడ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వాహనదారులకు ముందుగానే ఏ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలో సమాచారం అందించాలని ఆయన పోలీసు అధికారులకు సూచించారు. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

ముఖ్యమంత్రి పర్యటన సమన్వయకర్త తలశిల రఘురాం మాట్లాడుతూ సీఎం పర్యటనకు హాజరైయ్యే ప్రజలు, లబ్దిదారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని సదపాయాలు కల్పించాలని అధికారులను కోరారు. అంతకు ముందు ఆయన ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ ప్రదేశం రంగరాయ క్రీడా మైదానం, హెలిప్యాడ్ నిమిత్తం జిల్లా పోలీసు మైదానం, రోడ్ షో నిర్వహించే ప్రదేశాలను పరిశీలించి అవసరమైన ఏర్పాట్లను సూచించారు. సమావేశంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీ.హెచ్. నాగనరసింహారావు, జెడ్పీ సీఈవో ఎ.రమణారెడ్డి, ఇన్చార్జి డీఆర్వో డీఆర్డీఏ పీడీ కె.శ్రీరమణి, కాకినాడ పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే.సీతారామరావు, డీఎం సివిల్ సప్లయ్ డీ.పుష్పమణి, డీఎం అండ్ హెచ్‌వో డా జే.నరసింహ నాయక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. లావణ్య కుమారి, రోడ్డు భవనాల శాఖ ఎస్ఈ హరిప్రసాద్ బాబు, మెప్మా పీడీ బి.ప్రియంవద, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ కార్యక్రమం జనవరి 2 నుంచి ప్రారంభం

– ప్రతి ఒక్క పశువుకు టీకాలు వెయ్యాలి

– కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జాతీయ ఉచిత సామూహిక గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమము జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో "గాలి కుంటు వ్యాధి నివారణ టీకా"ల ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా కె. మాధవీలత మాట్లాడుతూ, జిల్లాకు సంబంధించిన గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని సకాలములో పూర్తిచేయాలని ఆదేశించారు. 2024 జనవరి 2 వ తేదీ మంగళవారం నుంచి నెల రోజులు పాటు " జాతీయ గాలి కుంటు వ్యాధి నివారణ "కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమములో పశు సవర్ధక శాఖ సిబ్బంది యావన్మంది పాల్గొని, క్షేత్ర స్థాయి విస్తృత ప్రచారము నిర్వహించాలన్నారు. జిల్లా లో ఉన్న 2 లక్షల 36 వేల 7 వందలు ఆవులు మరియు గేదెలకు నిబంధనల ప్రకారం టీకాలు వేయాలని తెలియజేశారు. సామూహిక టీకాల కార్యక్రమము ప్రతీ ఆర్భికే స్థాయిలో నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ తయారు చేసి తదనుగుణంగా కార్యక్రమము నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ గాలి కుంట వ్యాధి నివారణ కోసం జిల్లాలో పశువులకు వేసిన నిర్వహించిన టీకాల వివరాలు రైతువారిగా "భారత్ పశు ధన్" యాప్ లో ఎప్పటికప్పుడు అప్ లోడ్ చేయాలని స్పష్టం చేశారు.

ప్రతీ రోజు ఉదయం గం. 6.30 ల నుండి టీకాల కార్యక్రమము ప్రారంబించాలని, కోల్డ్ చైన్ విధానం పాటించాలని సూచించారు. క్షేత్ర స్థాయి లో చేపట్టే టీకా కార్యక్రమం లో జిల్లా లో ఉన్న ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి ఈ కార్యక్రమము లో భాగస్వాములను చేయాలని అన్నారు. ఎప్పటికప్పుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేయుటకు జిల్లా స్థాయిలో జిల్లా మానిటరింగ్ యూనిట్ ను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ కి జిల్లా కలెక్టర్ ఛైర్మన్ గాను, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి కన్వీనర్ గాను, డివిజినల్ స్థాయి ఉప సంచాలకులు మరియు రీజినల్ పశు వ్యాధి నిర్ధారణాలయం ఉప సంచాలకులు సభ్యులు గా వ్యవహరిస్తూ నిర్దేశించిన సమయం అనగా ది. 02.01.2024 నుండి 30 రోజుల్లో నాలుగు నెలల వయసు దాటిన ప్రతీ పశువుకు టీకాలు తప్పకుండా వేసేలాగా ఈ కమిటీ పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.ఈ జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమము రైతులకు ఆర్థికంగా నష్టం కలుగకుండా మరియు జాతీయ ఆదాయం లో వృద్ధి సాదించడం కొరకు నిర్దేశించబడినదని జిల్లా పశు సంవర్ధక అధికారి డా ఎస్ జి టి సత్య గోవింద్ తెలియజేసినారు. కావున రైతులకు పూర్తిగా అవగాహన కల్పించి సామూహిక టీకాల నిర్వహణ నిర్దేశించిన సమయములో పూర్తి చేయాలని క్షేత్ర స్థాయిలో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అందచేశా మని పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎస్ జి టి సత్య గోవింద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపా-జనసేన కూటమి జిల్లాలో అన్ని సీట్లు కైవసం చేసుకోవాలి- పవన్ కళ్యాణ్

– తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జిలతో భేటీ

కాకినాడ, మేజర్ న్యూస్ : జిల్లాలో అన్ని సీట్లను తెదేపా–జనసేన కూటమి కైవసం చేసుకోవాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ జిల్లాలో వైసిపికి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా రాకుండా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ కలిసి పనిచేయాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ తోను, మాజీ ఉప ముఖ్యమంత్రి పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయ చినరాజప్ప, జగ్గంపేట నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్సీ మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, పిఠాపురం టిడిపి ఇన్చార్జి ఎస్.వి.ఎస్.ఎన్.వర్మ, కాకినాడ సిటీ ఇంచార్జి వనమాడి కొండబాబు, రూరల్ ఇన్చార్జి పిల్లి అనంత లక్ష్మిలతో భేటీ అయ్యి, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కాకినాడ జిల్లాలో వైసిపికి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా రాకుండా తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ కలిసి పనిచేయాలని ఇన్చార్జిలతోనూ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో అన్నారు.

వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచడానికి నాలుగున్నర సంవత్సరాలు పట్టిందా..?

గోకవరం, మేజర్ న్యూస్ : టిడిపి పార్టీ గెలిచి ఉంటే ఒకేసారి పెన్షన్ 3 వేలు పెంచేవారు. కానీ జగన్ ప్రభుత్వం నాలుగున్నర సంవత్సరాల తర్వాత పెన్షన్ 3000 చేశారు. జగన్ చేసే మోసాల్లో ఇదొక్కటని. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి గునిపే భరత్. అన్నారు అధికారంలోకి రాగానే పెన్షన్ పెంచుతానని నమ్మించిన సీఎం జగన్ తీరు వలన అవ్వా తాతలకు తలకు రూ 18 వేలు నష్టం వాటిల్లిందని భరత్ విమర్శించారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యేనాటికి రెండు వందల రూపాయలు ఉండేదని దానిని చంద్రబాబు 2 వేలు చేశారు, జగన్ ముక్కుతూ మూలుగుతూ ఏడాదికి కొంత చొప్పున పెంచుకుంటూ.. వచ్చి అదే మహాభాగ్యంగా ప్రచారం చేసుకుంటున్నాడని పాదయాత్రలో దారి పొడవునా 1,700 హామీలు ఇచ్చిన జగన్ నెరవేర్చినవి మాత్రం 10 శాతం కూడా లేవు. అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి అమ్మఒడి ఇస్తామని చెప్పి తర్వాత ఇంటికి ఒక్కరికే అమ్మఒడి ఇచ్చారు. 5 సంవత్సరాలు ఇవ్వవలసిన అమ్మ ఒడిని నాలుగు సంవత్సరాలకే పరిమితం చేసి, ఒక సంవత్సరం యెగ్గొట్టా. ప్రతి పథకంలోనూ జగన్ ఇదే మాదిరిగా మతలబు పెట్టి మోసం చేశాడని ఈ ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను ఇంటింటికీ తిరిగి అల్లరి పాలు చేస్తామని , వైసీపీ ప్రభుత్వం ఏమి ఇరగదీసిందో శ్వేత పత్రం విడుదల చేసి తర్వాత ఓటు అడగాలని గునిపే భరత్ డిమాండ్ చేశారు. 2024 లో తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం వస్తుందని అప్పుడే ఆంధ్ర రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని భరత్ జోస్యం చెప్పారు.

లోపభూయిష్టంగా నూతన చట్టం - పేపకాయల

కాకినాడ, మేజర్ న్యూస్ : అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టం వల్ల ఎవరికీ భద్రత ఉండదని ప్రముఖ న్యాయవాది పేపకాయల రామకృష్ణ అన్నారు. రోటరి గోల్డెన్ జూబ్లి క్లబ్ సమావేశం స్థానిక రోటరి హాల్‌లో క్లబ్ అధ్యక్షులు నరహరిశెట్టి రవికృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆంధ్రప్రదేశ్ లాండ్ టైటిలింగ్ ఏక్ట్ పై సమగ్రంగా రామకృష్ణ వివరించారు. ఈ చట్టాన్ని ప్రజల నుండిగాని వివిధ సంస్థల నుండిగాని విజ్ఞప్తులు లేకుండా మరియు ఈ చట్టంపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం ఉన్న జ్యుడిషియరి, ఎగ్జిక్యూటివ్, శాసనవ్యవస్థల తాలూకు అధికారాలను నిర్వీర్యం చేసే విధంగా ఉందని అన్నారు. స్థిరాస్థి సంబంధించిన రక్షణ చట్టాలు అనేకం ఉన్నాయని, వాటినన్నిటిని కాదని సమాంతర చట్టవ్యవస్థను తీసుకురావడం ద్వారా రాజకీయ లబ్ది కోసమేనన్న విషయం బహిర్గతం అవుతుందన్నారు. సమాజంలో ఉన్న వివిధ సంస్థలు ఈ చట్టంపై స్పందించడంతో పాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి వీటిలో ఉన్న ప్రమాదకరమైన అంశాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్ళాలన్న విషయాన్ని ఆయన స్పష్టం చేసారు. ఇప్పటికే ఈ చట్టం ద్వారా జరిగే అనేక ఉపద్రవాలను ప్రస్తావిస్తూ న్యాయవాదులు వారి వారి పరిధిలో ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని గుర్తు చేస్తూ, సామాన్య ప్రజలకు న్యాయవాదులు వీటిపై స్పందించడంపై అవగాహన లేకపోవడం వల్ల మరింతగా వివరిస్తున్నామని అన్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు జ్యుడిషియరి విభాగాలలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్షమంది ఈ వ్యవస్థలో పనిచేస్తున్నారని గుర్తుచేసారు. టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (టి.ఆర్.ఒ) నియమించడం ద్వారా స్థిరాస్తుల హక్కుల విషయాన్ని నిర్ధారించే విధంగా ఈ చట్టాన్ని తీసుకురావడం ద్వారా ప్రభుత్వం సంస్థలకు ఏవిధమైన అధికారం లేకుండా చేయడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేసారు. హైకోర్ట్ మినహా న్యాయవ్యవస్థను సంప్రదించే విధంగా ఈ చట్టంలో ఉన్న అంశాన్ని ప్రస్తావిస్తూ సామాన్యులకు ఇది సాధ్యపడని విషయంగా అన్నారు. టి.ఆర్.ఒ వ్యవస్థ తీసుకురావడంలో అనుభవాలతో పాటు చట్టాలపై ఉన్న విషయాలు ఏమేరకు వారికి తెలుస్తాయని ప్రశ్నించారు. ఏవిధమైన అవగాహన ఈ వ్యక్తులకు ఉంటుందని ప్రశ్నించారు. మన ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రశ్నించడంతో పాటు ఉద్యమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జలియన్‌వాలా బాగ్ విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ప్రజలపై ఈ కొత్త చట్టాన్ని రుద్దే ప్రయత్నం చేస్తున్నారని గుర్తు చేసారు. ఈ కొత్త చట్టంలో ప్రజలకు తీరని అన్యాయం జరిగే విధంగా ఉందని, ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన స్పష్టం చేసారు. క్లబ్ అధ్యక్షులు రవికృష్ణ మాట్లాడుతూ ఈ చట్టంవల్ల కలిగే ప్రమాదాలను ముందుగా గుర్తించి నిరసన కార్యక్రమాలను బార్ కౌన్సిల్‌తో పాటు న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ తరహా చట్ట రూపకల్పన లేదని, రాజకీయ నాయకులకు లబ్ది చేకూరే విధంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు సైతం వీటిని సమర్ధించకుండా అమలు కాకుండా ఉద్యమాలు చేపట్టేందుకు తమ అంగీకారాన్ని తెలపాల్సిందిగా విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ ఉదయభాను, కోశాధికారి ఎం.పవన్, ఎస్.శ్రీకాంత్, డాక్టర్ గోపీనాథ్, వాకచర్ల సూర్యం, చోడిశెట్టి పద్దరాజు, మాచారెడ్డి, భూపేంద్ర, టేకుమూడి సూర్యనారాయణ, బదిరెడ్డి వెంకన్న, దాసరి సాయికృష్ణ, డాక్టర్ గొడవర్తి సత్యమూర్తి, డాక్టర్ పరశురామ్‌తో పాటు అధిక సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు. ఈ కొత్త చట్టంపై సభ్యులు అడిగిన సందేహాలకు సమగ్రంగా రామకృష్ణ వివరించారు. అనంతరం ఆయన్ని ఘనంగా సత్కరించారు.

జాతీయోద్యమ స్ఫూర్తితో పోరాడతాం

– సమగ్రశిక్షా ఉద్యోగుల ప్రతిన

– స్వాతంత్రోద్యమ నాయకులకు వినతి పత్రాలు అందించిన ఉద్యోగులు

– సమానత్వ హక్కులకై నినాదాలు

కాకినాడ,మేజర్‌న్యూస్ : సమగ్రశిక్ష కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకుచేపట్టిన నిరవధిక సమ్మె కాకినాడలో 11వ రోజుకు చేరుకుంది.ఈసందర్భంగారాష్ట్రజేఏసీపిలుపుమేరకు జాతీయో ద్యమ నాయకులైన మహాత్మాగాంధీ,బాబు జగ్జీవన్‌రామ్, సామాజిక విప్లవకారుడైన జ్యోతిబా పూలే, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా జాతీయోద్యమ స్ఫూర్తితో వేతన బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడుతామని, సమానత్వపు హక్కుల కోసం నినదిస్తామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.జేఏసీ జిల్లా కార్యదర్శి సత్య నాగమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు పి.వి.వి.మహాలక్ష్మి, పి.రాజు, రమణ, పి.సునీత, వి.సుజాత, కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ పది రోజుల సమ్మె అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించగా జిల్లా నుంచి జేఏసీ నాయకులు చంటిబాబు, రాధాకృష్ణ, తారక్‌లు వైజాగ్ చర్చలకు హాజరయ్యారని తెలియజేశారు. ప్రభుత్వ స్పందనను బట్టి, సమగ్ర శిక్ష డిపార్ట్‌మెంట్లో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, పార్ట్ టైం పద్ధతిలో పనిచేసే తొమ్మిది రకాల కేడర్లకు సంబంధించి అన్ని డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఒక్కరి కోసం అందరం ఐక్యపోరాటాలను ఉధృతం చేస్తామని జగన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాజ్యాంగం ప్రకారం మరియు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సర్వశిక్ష అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం అమలు చేసి తీరాలని, జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా రెగ్యులరైజ్ చేస్తానన్న హామీని అమలు జరిపేంతవరకు ఈ పోరాటాన్ని విరమించే ప్రసక్తే లేదని తెలియజేసారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలు, మున్సిపల్ ఉద్యోగులతో చేస్తున్న చర్చలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘ పోరాటాలకు మానసికంగా సిద్ధపడే సమ్మె పోరాటంలోకి దిగామని హెచ్చరించారు. శనివారం శిబిరానికి తాళ్ళరేవు యుటిఎఫ్ నాయకులు కె.ఎం.ఎం.ఆర్. ప్రసాద్, తాళ్లరేవు మండల శాఖ అధ్యక్షులు ఎం తాతారావు, మండల కార్యదర్శి సిహెచ్. త్రిమూర్తులు, కె.రవీంద్ర, కె.ఈశ్వరరావు, సత్యన్నారాయణ, ప్రకృతి కుమార్, డానియెల్ మద్దతుగా మాట్లాడి ఆర్థిక సహకారం అందించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జేఏసీ నాయకిలు ఏ.లోవరాజు, సహాయ కార్యదర్సులు జి.నారాయణ, శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.రాజు, ఎం.గంగాధర్ తదితరులు నాయకత్వం వహించారు.

32వ వార్డులో జనసేన 'భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్‌కి హామీ' యాత్ర

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో భవన నిర్మాణ కార్మికుల భవిష్యత్ కి హామీ యాత్రా కార్యక్రమం శనివారం 32వ వార్డ్ సత్య ప్రసన్న నగర్, మహాత్మ వీధి ప్రాంతంలో అగ్రహారపు సతీష్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ శ్రేణులు భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడి వారి కష్టాలపై సమాచారం తెలుసుకున్నారు. నేడు ఈ వై.సి.పి. ప్రభుత్వ లోపభూయిష్టమైన విధి విధానాలతో భవన నిర్మాణ రంగం కుదేలు అయిపోయి పతనావస్థకి చేరుకుందన్నారు. ధరల ప్రభావం వల్ల సామాన్య ప్రజలు సొంత ఇంటి కల కలగానే మారిందనీ ఇంకో పక్క ప్రభుత్వ కాంట్రాక్టుల బిల్లులు చెల్లించడంలేదని కాంట్రాక్టర్లు కొత్తపనులు చేపట్టడం లేదని, దీని ప్రభావంతో కొన్ని లక్షల కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. భవన నిర్మాణ కార్మికుల శ్రేయస్సు కోసం జనసేన పార్టీ తెలుగుదేశం ఉమ్మడి మేనిఫెస్టోలో ఉచిత ఇసుక విధానంతో పాటుగా ముఖ్యమైన ప్రతిపాదనలు చేపడుతున్నాయని, కార్మికులకు పని భద్రత దిశగా చర్యలు చేపడతాయని వివరించారు. కార్యక్రమంలో రామిరెడ్డి నాగేష్, దుర్గ, శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువతలో నైపుణ్యాన్ని పెంచుతాయి

– గొంగడి వెంకట రామిరెడ్డి

ఎటపాక, మేజర్ న్యూస్ : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి అని గుండాల ఎంపిటిసి గొంగడి వెంకట రామిరెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలలో భాగంగా క్రికెట్‌ను శనివారం పురుషోత్తపట్నం గ్రామపంచాయతీలోని సెయింట్ ఆన్స్ పాఠశాల నందు క్రీడా మైదానంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి టాస్ వేసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉండే యువకులలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేటందుకు ఈ క్రీడల దోహదపడతాయని తెలిపారు. సచివాలయ, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి ఈ ఐదు స్థాయిలలో ఈ క్రీడలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువతలో క్రీడలను ప్రోత్సహించే విధంగా 9 సంస్థలతో ఒప్పందాలు చేసుకుంది. ఈ సంస్థల నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా టాలెంట్ చర్చ్ నిర్వహించనున్నారు. దీనివలన పలు లీగ్ లలో ఏపీ క్రీడాకారులకు ఎక్కువ అవకాశాలు దక్కుతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు, విఆర్వో మారయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి మరియు సచివాలయం సిబ్బంది

గ్యాస్ ఈ-కేవైసీకి గడువు లేదు..

కొత్తపేట, మేజర్ న్యూస్ : గ్యాస్ ఈ–కేవైసీకి గడువు లేదని కొత్తపేట ఎమ్.ఎస్.ఓ రమాదేవి శనివారం తెలియజేశారు.గ్యాస్ వినియోగదారులు ఏజెన్సీల వద్ద క్యూ కట్టాల్సిన అవసరంలేదని ఆమె తెలిపారు. గ్యాస్ కనెక్షన్ కు ఈ –కెవైసి చేయాలని ప్రభుత్వం నిబంధనల నేపథ్యంలో గ్యాస్ కంపెనీలకు వెళ్లవలసిన అవసరం లేకుండానే ఆన్లైన్ లోనూ ఈ –కెవైసి చేసుకోవచ్చునన్నారు.ఈ –కెవైసి చేసుకునేందుకు నిర్ణీత గడువు అంటూ ఏమీ లేదని ఎప్పటికైనా చేసుకొనవచ్చుని తెలిపారు.ఆయా ఏజెన్సీల ద్వారా గ్యాస్ ఇంటికి తీసుకువచ్చే డెలివరీ బాయ్ లు తమ మొబైల్ ఫోన్ ద్వారా ఆన్లైన్ లో ఈ–కెవైసి ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు.ఒకవేళ ఈ –కెవైసి చేయనప్పటికి గ్యాస్ సరఫరా యధావిధిగానే చేస్తారని ఆమె తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

అంబాజీపేట, మేజర్ న్యూస్ : క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాపాస్టర్ ఫెలోషిప్ జెనరల్ సెక్రెటరీ డాక్టర్ ధనరాజు సికిలే మందిరంలో క్రిస్మస్ ఆరాధన ఘనంగా జరిగినది. ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ జె.డానియల్ పాల్ క్రిస్మస్ సందేశమును అందించినారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి డాక్టర్ సుందర విజయమ్ క్రిస్టమస్ శుభాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబాజీపేట మండలం పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ లాజరు, సెక్రటరీ పాస్టర్ బి.ఆర్. విలియమ్స్, అంబాజీపేట క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు పాస్టర్ కుసుమ రత్నం, పాస్టర్ ఎన్ .రవి, పాస్టర్ కె.ఇలియాజర్, విశ్వవాణి మూర్తి పాల్గొనినారు. డాక్టర్ ధనరాజు, వారి కుటుంబసభ్యులు, జిల్లా అధ్యక్షులు అయిన బిషప్ డానియల్ పాల్‌ను సన్మానించారు. స్థానిక సంఘస్తులు వచ్చిన వారందరికీ క్రిస్మస్ విందు ఏర్పాటు చేసినారు.

అన్ని సెంటర్లలో పోలీసు బృందాలచే తనిఖీలు

– ఏఎస్పీ జగదీష్ అడహల్లి

రంపచోడవరం, మేజర్ న్యూస్ : రంపచోడవరం సబ్ డివిజన్ అంతటా ఈనెల 31వ తేదీ రాత్రి అన్ని సెంటర్లలో పోలీసు బృందాలచే తనిఖీలు ముమ్మరం చేయుటకు పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేసామని రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహల్లి శనివారం తెలిపారు. రంపచోడవరం సబ్ డివిజన్ ప్రజలందరికీ ముందుగా ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, 31 వ తేదీ రాత్రి సమయములో కొన్ని నియమ, నిభందనలు కచ్చితంగా పాటించి పోలీసులకు సహకరించవలసిందిగా సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలకు, యువతకు, వారి తల్లిదండ్రులకు ఏఎస్పీ జగదీష్ అడహల్లి విజ్ఞప్తి చేశారు. వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు లౌడ్‌స్పీకర్లు/మ్యూజిక్ సిస్టంలు ఉపయోగించుట కొరకు తప్పనిసరిగా సంబంధిత పోలీస్ అధికారుల నుంచి ముందస్తు అనుమతి పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చట్ట ప్రకారం తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో, జంక్షన్ లలో కేకులు కట్ చేయడం నిషేధమన్నారు. ఈ వేడుకలలో భాగంగా అశ్లీల నృత్యాలు, అశ్లీల చర్యలు, సినిమాలు, అశ్లీల సంజ్ఞలకు అనుమతి లేదన్నారు. ఈ వేడుక కార్యక్రమాలు నిర్వహించేవారు

ప్రజలకు ప్రమాదం కలిగించే ఎటువంటి కార్యక్రమమైన, విన్యాసమైన నిషిద్ధం, ప్రేలుడు పదార్థములు, ఫైర్ అర్మ్స్ ఉపయోగించుట పూర్తిగా నిషిద్ధమన్నారు. ప్రజలు పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవించుట కానీ, త్రాగి వాహనాలు నడపడం, పేకాట ఆడడం నిషిద్ధమని, డిజె లతో నృత్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆకతాయిలు, మితిమీరి ప్రవర్తించే యువతను, రోడ్లుపై చిందులు తొక్కే మందుబాబులను, ఇష్టానుసారంగా వాహనాలను నడిపేవారిని చిత్రీకరించేందుకు వీడియో కెమేరాలు, డిజిటల్ కెమేరాలు ఉపయోగించవలసినదిగా సిబ్బందిని ఆదేశించామని తెలిపారు. వాహనాలును అతి వేగంగా నడపడం, సైలేన్సర్ తీసి వాహనాన్ని నడపడం, హారన్ అదే పనిగా మ్రోగించడం, రాంగ్ రూట్లలో డ్రైవ్ చేయడం, వాహనంపై విన్యాసాలు చేయడం, జిగ్ జాగ్ గా డ్రైవ్ చేయడం, ప్రమాదకరంగా వాహనాలు నడపడం, ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం లాంటి చర్యలను నిరోధించడానికి ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. అన్ని ప్రార్ధన మందిరాల వద్ద పోలీసు నిఘా, గస్తీ ఏర్పాటు చేయడమైందని, అన్ని ప్రార్ధనా మందిరాల నిర్వాహకులు ప్రార్ధన మందిరాల వద్ద జనం గుమిగూడకుండా చర్యలు తీసుకోవాలని, నిర్ణీత సమయంలో ప్రార్ధనలు ముగుంచుకొని వెళ్లవలసినదిగా కోరారు. ప్రభుత్వ అనుమతి పొందిన బార్లు, హోటళ్లు నిర్ణీత సమయం దాటి తెరచి ఉంచితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని, మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులు వారి తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. డిసెంబర్ 31న నూతన సంవత్సర వేడుకులకు హాజరయ్యే మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా, దురుసుగా ప్రవర్తించరాదని, అలా పాల్పడినవారిపై కఠిన చర్యలు చట్టపరంగా తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తి హత్య...కేసు నమోదు..

– వాగ్వాదంలో చోటుచేసుకున్న సంఘటన..

కొత్తపేట, మేజర్ న్యూస్ : హత్య చేసిన సంఘటనలో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్.ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తపేట గ్రామం పలివేల వంతెన సమీపంలో మెయిన్ రోడ్ ప్రక్కన దారుణ హత్య కు గురయ్యాడు.అన్న తలపై ఇనుపరాడ్డు తో తమ్ముడు బలంగా పొడవటంతో చనిపోయాడు.వివరాల్లోకి వెళ్తే బూరగాయల శ్రీనివాస్ అనే వ్యక్తికి ముగ్గురు సోదరులు అయితే ఒక సోదరుడు దత్తతకు వెళ్లిపోగా ముగ్గురు అన్నదమ్ములు ఒకే సగృహంలో నివసిస్తున్నారు.మృతుడు శ్రీనివాస్ కు వివాహం కాగా భార్య ఇదివరకే వదలిపెట్టి తన పుట్టింటికి వెళ్ళిపోయింది.అయితే ముగ్గురు అన్నదమ్ములు తల్లి తో పాటు ఉంటున్నారు.పెద్ద కొడుకైన విజయ భాస్కర శ్రీనివాస్ కు చిన్న కుమారుడైన సోమశేఖర్ కు ఇద్దరి మధ్య ఏదో విషయంలో తరుచూ గొడవ జరిగేది.దీంతో శ్రీనివాస్,సోమశేఖర్ ను ఇంట్లోకి రానిచ్చేవాడు కాదు.అయితే సోమశేఖర్ తను పనిచేసే చోట పడుకుని ఉదయం వచ్చేవాడు.అదేవిధంగా శనివారం ఉదయం ఇంటికి వచ్చాడు.ఆ సంధర్భంలో మరల ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి కేకలు వేసుకున్నారు.శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లి పడుకున్నాడు.అరగంట తర్వాత ఇంటి ఎదురుగా ఉన్న పహారి వద్ద ఇనుప రాడ్డు తీసుకుని గదిలో పడుకుని ఉన్న శ్రీనివాస్ తలపై బలంగా కొట్టడంతో రక్తపు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కొత్తపేట డిఎస్పీ కే.వి.రమణ,గన్నవరం సిఐ ప్రశాంత్ కుమార్,స్థానిక ఎస్.ఐ జ్వాలా సాగర్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు.ఈ సంఘటనపై మృతిని తల్లి బూరగాయల ఈశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై కేసు నమోదు చేయగా,ఇంఛార్జి సి.ఐ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీలు సచివాలయాల ముట్టడి..

ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీల సమ్మె లో భాగంగా సచివాలయాల ముట్టడి కార్యక్రమం చేపట్టారు. ఏలేశ్వరం మండలంలోని 13 గ్రామాలలో గల అంగన్వాడి కార్యకర్తలు సచివాలయాలను ముట్టడించారు. శనివారం ఉదయం మండల పరిధిలోని మర్రి వీడు, జె. అన్నవరం, తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట, లింగంపర్తి బద్రవరం పేరవరం, పెద్దనాపల్లి, సిరిపురం, ఎర్రవరం, తిరుమలి, అప్పన్నపాలెం గ్రామాలతో పాటు మండల కేంద్రమైన ఏలేశ్వరం తదితర అంగన్వాడి కేంద్రాలలో విధులు నిర్వహించే వర్కర్లు, సహాయ వర్కర్లు ఆయా గ్రామాల సచివాలయాలను ముట్టడించి, సచివాల కార్యదర్శిలకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా అంగనవాడిల సెక్టర్ అధ్యక్షురాలు కాకరపల్లి సునీత మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు 19 రోజులుగా రోడ్లెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి కి చీమకుట్టినట్టైనా లేదన్నారు. ఎన్నికలకు ముందు నాఅక్కలు చెల్లెమ్మలు అని అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తాను అన్న జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు కనీసం పట్టించుకోవటం లేదని అన్నారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాన్ని విరమించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల నాయకులు ఎన్ అమలావతి, సిహెచ్ వెంకటలక్ష్మి, జె రాణి, పి నూకరత్నం ఆర్ రత్నకుమారి పి దుర్గాసూర్యకుమారి కే రమ్య పి గంగాభవాని కే. బంగారు పాప తదితరులు నాయకత్వం వహించారు.

నడిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

– తండ్రితో ఇంటింటికి తిరిగిన ఎమ్మెల్యే తనయుడు వరుణ్ సాయి

పెరవలి, మేజర్ న్యూస్ : తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం నడిపల్లి గ్రామంలో డిసెంబర్ 30వ తేదీ శనివారం"గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న నిడదవోలు నియోజకవర్గ శాసనసభ్యులు జి. శ్రీనివాస్ నాయుడు వారి తనయుడు వరుణ్ సాయి గ్రామం లో ఇంటింటికి తిరుగుతూ"గడప – గడపకు మన ప్రభుత్వం" అందిస్తున్న సంక్షేమ పథకాలను అధికారుల సమక్షంలో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని తెలుసుకోవడమే కాకుండా వారి అవసరాలను గుర్తించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తెలియజేశారు నడుపల్లి గ్రామం నందు ఎమ్మెల్యేజి.శ్రీనివాస్‌నాయుడు గడపగడపకూ తిరుగుతూ. వృద్ధులు, అక్కాచెల్లెమ్మలు, యువతతో మాట్లాడారు. అన్నా.. రైతు భరోసా సాయం అందిందా.. అవ్వా, తాత పింఛన్ వస్తోందా.. ఆరోగ్యం బాగుందా.. అక్కా వైఎస్సార్ ఆసరా.. చేయూత.. అమ్మ ఒడి డబ్బులు పడ్డాయా అంటూ అప్యాయంగా పలకరించారు. ప్రజలను సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటిలోనూ నవరత్నాల ద్వారా లబ్ధి పొందుతున్నట్లు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఇప్పుడు జగనన్న ప్రభుత్వానికి తేడా వివరిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి కులం,మతం, పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేదని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు తనయుడు వరుణ్ సాయి నడిపల్లి గ్రామ సర్పంచ్ బిరా సత్యవేణి రాజు, సొసైటీ అధ్యక్షులు కరటూరి ఉదయ్ భాస్కరరావు, జడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజన కిచ్చు, ఎంపీటీసీ,మండల వైసిపి అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ, గ్రామ నాయకులు కరటూరి గోపి కొమ్మిశెట్టి రాముకార్యకర్తలు, సచివాలయం కన్వీనర్లు, సచివాలయం సిబ్బంది, గృహ సారధులు, వాలంటీర్స్ గ్రామ వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌ని పర్మినెంట్ చేయాలి

– ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వెహికల్ పార్కింగ్‌కు స్థలం కేటాయించాలి

కాకినాడ, మేజర్ న్యూస్ : ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ సెక్యూరిటీ గార్డ్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ సమావేశం శనివారం మధ్యాహ్నం కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షులు కే. వి.రామయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు కే.మోహన్ రావు హాజరయ్యారు. ప్రసాద్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో సుమారు 20 సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్న వారిని తక్షణమే పర్మనెంట్ చేయాలని ప్రసాద్ అన్నారు. పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా, ఉమ్మడి విశాఖ జిల్లా ల వ్యాప్తంగా రోజుకు సుమారుగా మూడువేల మంది పైగా ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, వారికి తెలియని సమాచారం తెలియజేయడం, పేషెంట్లకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తున్న సెక్యూరిటీ గార్డులను ప్రభుత్వం గుర్తించి అవసరతను బట్టి సాంపిక భద్రత కల్పించాలని ప్రసాద్ అన్నారు. ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో వెహికల్ పార్కింగ్ స్థలం లేకపోవడం వల్ల ప్రజలు, పేషెంట్లు తీవ్రత ఇబ్బందులకు గురవుతున్నారని, నిషేధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసినవారిని సెక్యూరిటీ గార్డ్స్ అడిగితే వారిపై దాడులు నిర్వహిస్తున్నారని, ఇలాంటి దాడులు తరచూ జరుగుతున్నాయని, కాకినాడ సిటీ శాసనసభ్యులు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పార్కింగ్ స్థలం ఏర్పాటుకు చొరవ చూపాలని ప్రసాద్ అన్నారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ కాకినాడ బ్రాంచ్ అధ్యక్షులు కే.మోహన్‌రావు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్‌గా పరిష్కరిస్తున్నామని, సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్‌కి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఎప్పుడు మద్దతు ఉంటుందని, ప్రభుత్వం చిత్తశుద్ధితో సెక్యూరిటీ గార్డులందరినీ పర్మినెంట్ చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి అనిల్, మధు, ఎం రాజేంద్ర, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు

41వ డివిజన్‌లో జనసేన 'నాదెండ్ల మనోహర్ గారి మాట కాకినాడ సిటీలో అందరి నోట'

కాకినాడ, మేజర్ న్యూస్ : కాకినాడ సిటిలో జనసేన పార్టీ కాకినాడ సిటీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ సూచనలతో నాదెండ్ల మనోహర్ గారి మాట కాకినాడ సిటీలో అందరి నోట కార్యక్రమం శనివారం వాశిరెడ్డి సత్యకుమార్ ఆధ్వర్యంలో 41వ డివిజన్ రెడ్ క్రాస్ హాస్పిటల్ ప్రాంతంలో జరిగింది.ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ జనసేన పార్టీ పి.ఏ.సి. చైర్మన్ నాదెండ్ల మనోహర్ బట్టబయలు చేస్తున్న ప్రభుత్వ అవినీతిలను తాము నాదెండ్లగారు మాట కాకినాడలో అందరినోట అనే నినాదంతో నినాదంతో ప్రతిరోజూ చైతన్య యాత్రని చేస్తున్నామన్నారు. వై.ఎస్.ఆర్. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన ఒక్కో పనీ ఒక్కో స్కాముగా బయటకి వస్తున్నాయన్నారు. అందుకు ఉదాహరణే, గేదెల కొనుగోలు స్కాము, పిల్లల స్కూలు బ్యాగు & షూలు స్కాము, జగనన్న ఇళ్ళు స్కాము, అమ్మ ఒడి స్కాం, సర్వసిక్షణా అభియాన్ పథక నిధుల స్కాము ఇలా వెతికేకొద్దీ బయటపడుతున్నాయన్నారు. ఇవన్నీ యెక్కడ బయటపడతాయో అనేనా గవర్నమెంట్ వెబ్‌సైటులో జీవోలను పెట్టలేదని ఎద్దేవా చేసారు. ఆఖరుకి గవర్నమెంటు జీవోల కోసం కూడా కోర్టు మెట్లు ఎక్కే పరిస్థితిని తీసుకువచ్చింది ఈ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అని విమర్శించారు. ఈ వై.సి.పి. అవినీతిని ప్రజలకు తెలియచేసేందుకే తాము ఈ చైతన్య యాత్రని చేపడుతున్నామని అన్నారు. రానున్న ఎన్నికల రోజుల్లో మరిన్ని మాయ మాటలు కథలతో ఈ వై.సి.పి. ప్రభుత్వం ప్రజలమీద పడుతుందనీ జాగ్రత్తగా గమనించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సత్యకుమార్, రమణ, నానాజీ, నూకరాజు, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

32వ డివిజన్ సత్యప్రసన్న కాలనీలో 'ముస్లిం సచార్ యాత్ర'

కాకినాడ, మేజర్ న్యూస్ : శనివారం కాకినాడ సిటీ జనసేన పార్టీ ఇంచార్జ్ ముత్తా శశిధర్ ఆదేశాలపై స్థానిక 32వ డివిజన్ సత్యప్రసన్న కాలనీలో ముస్లిం సచార్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మొయినుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ముస్లింల పరిస్థితులు సామాజిక ఆర్థిక స్థితిగతులు మారాలంటే జనసేన ప్రభుత్వమే రావాలని, జస్టిస్ రాజ్ రాజేంద్ర సచార్ కమిటీ ప్రతిపాదించిన సూచనలను అమలు చేస్తానని తన మేనిఫెస్టోలో ఆ అంశాలను ఉంచడం ద్వారా ముస్లింలకు మేలు చేస్తానని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఒక్కరే మాట ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. నేడు ముస్లింలు సామాజిక, ఆర్థిక అసమానతతో ఇబ్బందులు పడుతున్నారని, వారి జీవన విధానం మెరుగుపడాలంటే సచార్ కమిటీ సిఫార్సులను అమలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. కమిటీ సిఫార్సులలో ముఖ్యంగా ముస్లిం మహిళలకు విద్య ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం ద్వారా వారి యొక్క బ్రతుకులను మార్చడానికి అవకాశం ఏర్పడుతుందని, ముస్లిం బాలిక విద్యను పెంచాలి అంటే ముస్లిం పాఠశాలలను ఉర్దూ పాఠశాలలను మెరుగుపరిచాల్సినటువంటి బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ నేడు వైసీపీ ప్రభుత్వంలో ఉర్దూ పాఠశాలను సామాన్య పాఠశాలలతో అనుసంధానం చేయడం ద్వారా ముస్లింలు విద్యలో వెనుకబడుచున్నారని, ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ పోస్టులను భర్తీ చేయడం లేదని విమర్శించారు.

జనసేన ప్రభుత్వం మాత్రమే ముస్లింలకు న్యాయం చేస్తుందని అందుకు ఉదాహరణగా సచార్ కమిటీ సిఫార్సులను మేనిఫెస్టోలో చేర్చడమే కారణమని అన్నారు. రానున్న రోజుల్లో జనసేన తెలుగుదేశం ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని అందుకు ముస్లింలు సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మొయినుద్దీన్, షేక్ ఇమాం, సయ్యద్ బాజీ, ఎస్.కె.బాషా, ఎస్.కె.బషీర్, ఎస్.కె నగీనా, తాహెరా, షహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ, విక్రయ కేసులో ఇరువురి వ్యక్తులకు రిమాండ్

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : మండలంలోనివెలగలపాలెం గ్రామానికి చెందిన చీదరి నాగరాజు, దూసర పాము గ్రామానికి చెందిన దమ్ము దుర్గయ్యలను నాటు సారాయి కేసులో పట్టుబడి నందుకు 15 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సైలు రఘునాథరావు, ఎంకయ్యలు తెలిపారు. జడ్డంగి స్టేషన్ పరిధిలోనిచెరుకుంపాలెం పంచాయతీ వెలగలపాలెం గ్రామ శివారున అక్రమంగా సారాయిబట్టి నిర్వహిస్తున్న వెలగలపాలెం గ్రామానికి చెందిన నాగరాజును జడ్డంగి ఎస్సై రఘునాథ రావుకు శనివారం ఉదయంవచ్చిన సమాచారం మేరకు తన సిబ్బందితో వెళ్లి సారాయి బట్టి పై దాడి చేసిఅతని వద్ద 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి పది లీటర్ల నాటు సారాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైతెలిపారు.అతనిని రిమాండ్ నిమిత్తం అడ్డతీగల జె ఎఫ్ సీఎం కోర్టుకు కు తరలించగా మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.అలానే రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలోని దూసర పాము గ్రామ శివారు రిజర్వు ఫారెస్ట్ ఏరియాలో గ్రామానికి చెందిన దమ్ము దుర్గయ్య సారాయి అమ్ముతుండగా ఎస్సై వెంకయ్యకు ఈనెల 29న వచ్చిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడిచేసి అతనిని అదుపులోకి తీసుకుని అతను వద్దనుండి ఐదు లీటర్ల సారా సీజ్ చేసి ముద్దాయిని రిమాండ్ నిమిత్తం శనివారం అడ్డతీగల జె ఎఫ్ సీఎం కోర్టుకు తరలించినట్లు ఎస్సై వెంకయ్య తెలిపారు.

కూనవరం వచ్చిన ప్రతీ బస్ రేఖపల్లి వరకు రావాలి

– ఆర్టీసీ అధికారులు స్పందించాలి

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : కూనవరం వచ్చిన ప్రతీ ఆర్టీసీ బస్సులు వరరామచంద్రాపురం,మండల కేంద్రమైన రేఖపల్లి,వరకు వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని, వరరామచంద్రాపురం,మండల ప్రజలు కోరుతున్నారు. రోడ్లు సరిగా లేవని పాడేరు బస్ సర్వీస్ రేఖపల్లి రాకుండానే కూనవరం,వరకు పరిమితం చేశారు.రేఖపల్లి వచ్చి విధంగా(వచ్చి మళ్ళీ రిటన్) అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సర్వీస్ పెరుగుతుంది.సుమారు 60 గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.రోడ్లు బాగాలేవని బస్‌ను రద్దుచేయడం తగునా!రోడ్లు బాగాలేకపోతే అది ప్రజల తప్పా!ప్రభుత్వం తప్పు! అదికూడా ప్రజలపైనే రుద్దేస్తారా? రాత్రి వేళల్లో రేఖపల్లి రావాల్సిన బస్ లు కూడా కూనవరంలో ఆపేస్తున్నారు.గట్టిగా అడుగితే తప్ప బస్ సర్వీసు రేఖపల్లి,రావడంలేదు రాత్రివేళల్లో కూనవరం,నుండి వరరామచంద్రాపురం,రేఖపల్లి రావాలంటే వీధి కుక్కలు భయం,మహిళలు ఒంటరిగా ఏలా వస్తారు.ఆర్టీసీ అధికారులు గమనించాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్లు వేయాల్సిన ప్రభుత్వాలు(అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నాయి) వేయడం లేదు.ఆది కూడా ప్రజల తప్పేనా? ఆర్టీసీ అధికారులు ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని కూనవరం,వచ్చే ప్రతీ బస్ ను రేఖపల్లి వచ్చే విధంగా డ్రైవర్,కండాక్టర్లకు,ఆదేశాలు జారీ చేయాలని,వరరామచంద్రాపురం,ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

20రోజులుగా దీక్షలు చలనం లేని ప్రభుత్వం

– సి.ఐ.టి.యు.జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : 20 రోజులుగా అంగన్వాడీలు దీక్షలు చేస్తున్నా! కనీసం రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సి.ఐ.టి.యు.జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ, ఆరోపించారు. శనివారం దీక్షా శిబిరం నుండి రేఖపల్లి సచివాల యం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సచివాలయ,సెక్రటరీ శివ ప్రసాద్‌కి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సచివాలయం,నినాదాలతో హోరెత్తింది. అంగన్వాడీ వర్కర్స్ ని ఉద్దేశించి పూనెం సత్యనారాయణ, మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీ నేతగా రాజకీయాల్లో ఉన్నాను.కానీ ఇంత దుర్మార్గపు ప్రభుత్వాన్ని చూడలేదని ఆయన తెలిపారు. అసలే చాలీచాలని జీతాలు,పనిభారం ఎక్కువ ఐనా ఏం అడుగుతున్నారు! నీవు ఇచ్చిన హామీలను మాత్రమే అడుగుతున్నారు.కనీసం కనికరం లేకుండా గత 20 రోజులుగా కరుడుగట్టిన చలిలో అర్ధాకలితో ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవాల్సిన ప్రభుత్వం గానీ!సంబంధిత అధికారులు గానీ స్పందించకపోవడం పద్ధతిగా ఉందాని ఆయన ప్రశ్నించారు. అంగన్వాడీల ఉసురు తగిలి పతనం తప్పదని హెచ్చరించారు.సమస్యల పరిస్కారమా!ఆందోళనలు ఉధృతమా! మా దగ్గర రెండే ఆప్షన్లు ఈ విషయంలో

వేగంగా పారదర్శకంగా బియ్యం పంపిణీ...

– ఐ.టి.డి.ఏ, పి.ఓ. కావూరి చైతన్య

వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు చింతూరు ఐ.టి.డి.ఏ,పి.ఓ కావూరి చైతన్య వరరామచంద్రాపురం, మండల కేంద్రంలోని, రాజుపేట,చింతరేగుపల్లి, వడ్డిగూడెం,ధర్మతాళ్లు గుడెంలో ఎం.డి.యు.ఆఫరేటర్లతో, రెవిన్యూ, అధికారులతో క్షేత్ర స్థాయిలో వాలంట్రీ అందరూ ప్రజా పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. శనివారం మండల పర్యటనలో వాలంటీర్‌లకు, సంభందిత అధికారులకు, దిశానిర్దేశం చేశారు. జనవరి 1 తారీకు 2024 పి.డి.ఎస్.పంపిణీ కార్యక్రమం, తప్పనిసరిగా జరగాలని, అందరూ విధుల్లోహాజరయ్యేలా ఉండాలని సూచించారు.ఈ పర్యటనలో తహశీల్దార్ ఎన్ శ్రీధర్, ఇబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం ఎంపీడీవో శ్రీదేవి సస్పెన్షన్

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలు చేయడంలో నిర్లక్ష్య వైఖరి నేపథ్యంలో గోపాలపురం మండల అభివృద్ధి అధికారిణి ఆర్. శ్రీదేవిని విధుల నుంచి సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం , అభివృద్ధి పనులను పర్యవేక్షించడం పట్ల మండలంలో పేలవ ప్రదర్శన చూపడం, కలెక్టర్ నిర్వహించిన సమీక్ష సమావేశం లో హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును పరిగణన లోకి తీసుకుని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ప్రభుత్వము అమలు చేస్తున్న పథకాలను అర్హులకు అమలు చేయడంలో నిర్దుష్ట కార్యాచరణ ప్రణాళిక ప్రకారం క్షేత్ర స్థాయి అధికారులు సిబ్బంది బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

మిల్లెట్స్ వర్క్ షాప్‌కు విశేష స్పందన

రాజానగరం, మేజర్ న్యూస్ : "ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ – 2023" సందర్భంగా గోదావరిరిజినల్ క్లస్టర్ గ్రూప్‌ఆధ్వర్యంలో డా.వై.ఎస్.హార్టికల్చర్‌యూనివర్సిటీసహకారంతో నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన " మిల్లెట్స్ ఫర్ హెల్త్ అండ్ ఎంట్రప్రెన్యూర్ షిప్" వర్క్ షాప్ కు విశేష స్పందన వచ్చింది. నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ డా.తోలేటి జానకిరామ్, జె.ఎన్.టి.యు.కె. వీసీ ఆచార్య జి.వి.ఆర్.ప్రసాదరాజు, నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.బి.శ్రీనివాసులు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల హాజరై జ్యోతిప్రజ్వలన చేసి వర్క్ షాప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు మాట్లాడుతూ భారతదేశంలోని వాతావరణ పరిస్థితులు కారణంగ ప్రపంచానికి మనదేశం ఆహారాన్ని అందిస్తుందని అన్నారు. మిల్లెట్స్ ఒకప్పుడు పేదవాడి ఆహారంగా ఉండేదని నేటి ఆధునిక కాలంలో అందరికీ అవసరమైన ఆరోగ్యకరమైన ఆహారంగా ఉందని చెప్పారు. నేటి ఆధునిక కాలంలో ఆరోగ్యకరమైన ఆహారానికి అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. యువత ఎంట్రప్రెన్యూర్ షిప్ గా ఎదగాలని, మిల్లెట్స్ తో నూతన ఆహార పదార్థాలను చేసి సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలన్నారు.గోదావరిక్లస్టర్ యూని

వర్సిటీ ద్వారా భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేస్తామని తెలియజేసారు.డా.వై.ఎస్.ఆర్.హార్టికల్చర్ యూనివర్సిటీవీసీ డా.తోలేటి జానకిరామ్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ మిల్లెట్స్ ను ఉత్పత్తి చేసేదేశమని తెలియజేసారు. 2023 ఇంటర్నేషనల్ మిలెట్స్ ఇయర్‌గా జరుపుకోవడం ఆనందంగాఉందని చెప్పారు. మానవ ఆరోగ్యానికి మిల్లెట్స్ ఎంతో దోహదపడతాయని, ముఖ్యంగా మహిళల ఆరోగ్యానికి ఎంతో అవసరమని చెప్పారు. ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్న నేటి ఆధునిక కాలంలో ప్రజలు ఎక్కువగా మిల్లెట్స్ పై దృష్టి సారిస్తున్నారని చెప్పారు. మిల్లెట్స్ మిగిలిన పంటలతో పోల్చితే తక్కువ నీటితో పంట పడుతుందన్నారు.కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ఉద్యానతాలి మెను.వంటి ఆరోగ్యకరమైన ఆహారాన్ని సమాజానికి అందిస్తున్నామని చెప్పారు. మిల్లెట్స్ తో వివిధ రకాల వంటకాలను తయారు చేస్తున్నారని అన్నారు. మిల్లెట్స్ ను ఎంట్రప్రెన్యూర్ షిప్ స్టాట్ అప్ ప్రోగ్రామ్స్ గా మార్చుకొని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు జె.ఎన్.టి.యు.కె.వీసీఆచార్య జి.వి.ఆర్.ప్రసాద రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గోదావరి రిజినల్ క్లస్టర్ గ్రూప్ చాలా స్ట్రాంగ్ గా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ఇప్పటి వరకు గోదావరి క్లస్టర్ గ్రూప్ ద్వారా విద్యా, పరిశోధన సదస్సులు మరియు పలు కార్యక్రమాలు విజయవంతంగా చేసామన్నారు. త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పైసదస్సును నిర్వహిస్తామని తెలియజేసారు.నన్నయయూనివర్సిటీరిజిస్ట్రార్‌ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ, వై.ఎస్.ఆర్. హార్టికల్చర్ యూనివర్సిటీ, జె.ఎన్.టి.యు.కె., ఎన్.ఐ.టి. ఆంధ్రప్రదేశ్ లు గోదావరిరిజినల్ క్లస్టర్‌యూనివర్సిటీగా ఏర్పాడి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనిఅన్నారు. రిజిస్ట్రార్ డా.బి.శ్రీనివాసులుడా.వై.ఎస్.ఆర్ .హార్టికల్చర్ యూనివర్సిటీ అందిస్తున్న సేవలు, గోదావరి రిజినల్ క్లస్టర్ ద్వారా చేసిన కార్యక్రమాలు వివరించారు. కీలక ఉపన్యాసకులుగా ఐ.ఐ.ఎం.ఆర్ హైదరాబాద్ డైరెక్టర్ డా.సి.తార సత్యవతి ఆన్లైన్ ద్వారా మిలెట్స్ యొక్క ప్రాధాన్యతను, ఆరోగ్యపరమైన ఆహారపు అలవాట్లు గురించి తెలియజేసారు. అనంతరం మిల్లెట్స్ తో తయారు చేసిన ఆహార పదార్థాల ఫుడ్‌స్టాల్స్ మరియు యూనివర్సిటీ బోటనీ విద్యార్థులు మిల్లెట్స్ తో వేసిన స్వాగత ముగ్గు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్‌కోఆర్డినేటర్ డా.పి.విజయనిర్మల,.డా.కరుణశ్రీ, డా.పద్మావతి,ఆచార్యమోహనరావు,డా.వల్లి,డా.సలోమిసునీత అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.ఎస్.ఏ సిబ్బంది సమ్మెకు యుటిఎఫ్ మద్దతు..

గోకవరం, మేజర్ న్యూస్ : జిల్లా కేంద్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఎస్.ఎస్. ఏ ఉద్యోగులు చేస్తున్న 11వ రోజుకు చేరిన నిరవధిక సమ్మెకు గోకవరం మండల శాఖ సంపూర్ణ మద్దతును తెలియజేసింది. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.నాగభూషణం మాట్లాడుతూ.. ఎస్ఎస్ఎ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి నెల ఒకటో తేదీని వారికి జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది.అలాగే యుటిఎఫ్ గోకవరం మండల శాఖ అధ్యక్షులు ఆర్.హరనాథ్ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎస్ ఆర్. త్రిమూర్తులు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీరు చేస్తున్న సమ్మెకు యుటిఎఫ్ మండల శాఖ తరపున 5వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు.

భక్త జనసంద్రంగా వాడపల్లి క్షేత్రం

– భక్తవత్సలుడుకు భక్తుల నీరాజనాలు

ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కలియుగ వైకుంఠం వాడపల్లి వెంకటేశ్వరస్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజులు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ, అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేం ద్రవరం, గోకవరం విజయవాడ, విశాఖపట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్సై బి.వై.కిరణ్ కుమార్ తన సిబ్బందితో ప్రతిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారి ఆదాయం రూ.26 లక్షలు సమకూరింది.

19వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

– సమ్మెకు మద్దతు తెలిపిన ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, మేజర్ న్యూస్ : ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 19వ రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో సమ్మె శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సమ్మెకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 19 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏమి పట్టనట్లు వ్యవహరించడం చాలా దారుణమని, రాష్ట్రంలో ఏ కార్మికుడు సంతృప్తిగా లేరని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, యూనియన్ నాయకురాలు దాడి బేబి, రెడ్డి సీతారత్నం, ఐతి ప్రియ రంజని, పేపకాయల వీరవిజయ లక్ష్మి, టి.ఎల్.పద్మ, సావిత్రి, స్నేహ, కాలె దేవి, నెహ్రూ కుమారి, చంటమ్మ, నాగమణి, లోవతల్లి, వసంతలక్ష్మి, తులసి, వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు. సచివాలయాల వద్ద అంగన్‌వాడీ వర్కర్లు, లబ్దిదారులతో కలసి ధర్నా నిర్వహించి, సచివాలయ అడ్మిన్‌లకు వినతిపత్రాలు అందజేశారు.

ఆనంద నిలయంలో సిఎస్ఆర్ నిధులతో అదనపు వసతి గదులు నిర్మాణం

– జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభం

కాకినాడ, మేజర్ న్యూస్ : ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థులకు మెరుగైన వస్తువులు కల్పించాలనే లక్ష్యంతో సీఎస్ఆర్ నిధులు రూ.15 లక్షలతో అదనపు వసతి గదులను నిర్మించడం జరిగిందని జిల్లా కలెక్టర్ డా.కృతికా శుక్లా అన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల దగ్గర ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఆనంద నిలయంలో కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ వారిచే నూతనంగా నిర్మించిన బ్లాక్ ను జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా.. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, కోరమండల్ అధికారులతో కలిసి ప్రారంభించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుపులు, ఇతర సామాగ్రిని అందజేసి, పిల్లలందరికీ కలెక్టర్ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో కాకినాడ ఆనంద నిలయం అభివృద్ధికి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద కాకినాడ కోరమండల్ ఇంటర్నేషనల్ వారిచే రూ.15 లక్షల వ్యయంతో అదనపు వసతి బ్లాక్ ను నిర్మించినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే ఆనంద నిలయం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆర్.ఓ. ఫిల్టర్, వాషింగ్ మెషిన్, టీవీ, ఇతర చిన్న చిన్న వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఇంకా అవసరమైన ఇతర సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయడం జరుగుతుందని, ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తక్కువ సమయంలో అదనపు బ్లాక్ పనులు పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకురావడంలో కోరమండల్ ప్రతినిధులు ప్రత్యేక కృషి చేశారని కలెక్టర్ ఈ సందర్భంగా కోరమండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ డీ.వీ. రమణ మూర్తి, సీపీవో పీ.త్రీనాథ్, కోరమండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ సీ.హెచ్. శ్రీనివాసురావు, ఇతర సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, ఆనంద నిలయం వసతి గృహం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

– సిఐ వాసా వెంకటేశ్వరరావు

రంపచోడవరం, మేజర్ న్యూస్ : నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు కలిగించి, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం సిఐ వాసా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. రంపచోడవరం పరిసర ప్రాంతాల్లోని రిసార్ట్స్, అద్దె గదులు యాజమానులు, నిర్వాహకులతో శనివారం పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. రిసార్ట్స్, అద్దె గదులు వద్ద ఆర్కెస్ట్రా, డిజె సౌండ్ బాక్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని సిఐ పేర్కొన్నారు. అలాగే రిసార్ట్స్‌లు, అద్దె గదుల్లో మద్యం సేవించడంతోపాటు, డాన్సులు చేసి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా నూతన సంవత్సరం సందర్భంగా యువత, విద్యార్థులు తప్పతాగి అర్ధరాత్రి మోటారు వాహనాలపై అల్లర్లు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతన సంవత్సర వేడుకలు ప్రజలంతా ఆనందంగా గడుపుకొని పోలీసులకు సహకరించాలని సిఐ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో స్థానిక ఎస్ఐ మోహన్ కుమార్, అడిషనల్ ఎస్ఐ ఎం.ఆర్.కె. రాజు, రిసార్ట్స్, అద్దె గదులు యాజమానులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడికి యత్నం - డ్రైవర్‌కి తీవ్ర గాయాలు -గొల్లప్రోలులో ఉద్రిక్తత

గొల్లప్రోలు, మేజర్ న్యూస్ : గొల్లప్రోలులో శుక్రవారం రాత్రి హై టెన్షన్ చోటుచేసుకుంది. పిఠాపురం మండలం ప్రతిపాడు సర్పంచ్ ఊటా రామకృష్ణ పై స్థానిక రాయవరం రోడ్డులో కొంత మంది వ్యక్తులు దాడికి ప్రయత్నించారు.ఈ దాడిలో సర్పంచ్ అనుచరుడి తల పగిలి తీవ్ర గాయాలు కావడంతో పరిస్థితి అదుపుతప్పి తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాలు పరిశీలిస్తే... గొల్లప్రోలుకు చెందిన మాదేపల్లి నానాజీ వ్యాపార లాభాదీవులలో భాగంగా ప్రత్తిపాడు సర్పంచ్ రామకృష్ణకు కొంత సొమ్ము బాకీ పడ్డాడు.కొంతకాలంగా బాకీ అడుగుతున్న నానాజీ ఏవో సాకులు చెప్పి వాయిదాలు వేస్తున్నాడు తప్పించి బాకీ ఇవ్వడం లేదు.శుక్రవారం రాత్రి యధాప్రకారం సర్పంచ్ తన అనుచరుడు (డ్రైవర్)మొగలి అజయ్ కలిసి నానాజీని బాకీ అడిగారు.దీంతో వీరి మధ్య వాదోప వాదాలు చోటుచేసుకున్నాయి.దీంతో విచక్షణ కోల్పోయిన నానాజీ సర్పంచ్ డ్రైవర్ అజయ్ ను రాడ్ తో కొట్టి తీవ్రంగా గాయపరిచాడు.ఈ ఘర్షణలో గాయపడిన అజయ్ ను ఆసుపత్రికి తరలించారు. అనంతరం నానాజీ కొంతమంది గ్యాంగ్ ను కర్రలు,రాడ్లు తో వెంట పట్టుకుని మార్కెట్ సెంటర్ లో హంగామా సృష్టించారు.ఇదేం పద్ధతి అని అడిగిన ఇరువురి స్థానికులపై దాడి చేశారు.సర్పంచ్ రామకృష్ణ వస్తే గాని అక్కడ నుండి కదిలేది లేదంటూ వీరంగం సృష్టించారు. మరోవైపు సర్పంచ్ రామకృష్ణ అనుచరులు ప్రతిపాడు నుండి గొల్లప్రోలు చేరుకోవడంతో కలకలం మొదలైంది.ఒకరిపై మరొకరు దాడికి ప్రయత్నించుకునే లోపు లోనే పోలీసులు ప్రత్యక్షమయ్యారు. ఎస్సై వినయ్ ప్రతాప్ నేతత్వంలో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఒక్క క్షణం పోలీసులు ఆలస్యం అయి ఉంటే ఈ రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో కొట్లాట జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు.డ్రైవర్ అజయ్ ను గాయపరిచిన నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్ ప్రతాప్ తెలిపారు. సకాలంలో స్పందించి ఘర్షణ జరగకుండా నివారించిన పోలీసులను ప్రజలు అభినందించారు.

ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

– ఎస్సై వెలుగుల సురేష్

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : కాకినాడ జిల్లా ఎస్పి సతీష్ కుమార్, డిఎస్పి కె.లతాకుమారి ఆదేశాల మేరకు పెద్దాపురం పట్టణం మరియు మండల పరిధిలోని 23 గ్రామాల పంచాయతీల పరిధిలో నూతన సంవత్సర వేడుకలు స్నేహపూరిత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై వెలుగుల సురేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ 31వ తేది రాత్రి 12.30 వరకు మాత్రమే జరుపుకోవాలని ఈవెంట్స్ నిర్వహించేవారు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి వారి అనుమతి తీసుకోవాలని తెలిపారు. సిసి కెమెరాల పర్యవేక్షణ తప్పనిసరి అని అన్నారు. మద్యం త్రాగి, అధిక వేగంతో, పెద్ద శబ్దాలతో వాహనాలు నడపరాదని తెలిపారు. మద్యం మత్తులో విలువైన ప్రాణాలను పాడు చేసుకోవద్దని, మరి ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. డిజె సౌండ్ బాక్స్‌లు, బాణాసంచా కాల్చేందుకు అనుమతులు లేవని, ఆయన తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు చేయకూడదని, చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు. కావున ప్రజలు, యువత గ్రహించాలని ఆయన సూచించారు.

2019లో జగనన్న ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ సచివాలయాల వద్ద అంగన్వాడీల నిరసన

రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : 2019లో ఎన్నికల ముందు జగనన్న చేసిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీలు మండల కేంద్రమైన రాజవొమ్మంగి సచివాలయం ఎదుట శనివారం నిరసన తెలిపారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు హెల్పర్లు మినీ వర్కర్లు స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా 19వరోజు సమ్మె దీక్షలు కొనసాగించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మిక సంఘ గీతాలకు అంగన్వాడీలు రహదారిపై లయబద్ధంగా నృత్యాలు చేసి కబాడీ ఆడారు.అంగన్వాడీలు చేస్తున్న ఉద్యమానికి అంగన్వాడి కేంద్రాల లబ్ధిదారులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి ప్రాజెక్టు నాయకులు కె వెంకటలక్ష్మి,సిహెచ్ కుమారి,సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు టి శ్రీను లు ప్రసంగిస్తూతెలంగాణ కంటే అదనంగా వెయ్యి రూపాయలు ఇచ్చి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మాట తప్పకుండా నిలబెట్టుకోవాలన్నారు. పలువురు అంగన్వాడి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎల్ సత్యవతి,నూక రత్నం, కె లక్ష్మి,చిన్నమ్మలు, రమణి,రమణ,రత్నం, రాజేశ్వరి,మంగ,రాధ,పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు వున్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం

కాకినాడ, మేజర్ న్యూస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 54వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కాకినాడ కచేరి పేటలో గల ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం జెండాను ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కే.ప్రసన్నకుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ.అశోక్ మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణ కోసం ఆలుపెరగని పోరాటం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నిరంతరం విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. గత 54సంవత్సరాల కాలంలో 279 మంది ప్రాణత్యాగం చేశారన్నారు. విద్యారంగం పరిరక్షణ కోసం దేశంలో నికరంగా పోరాడే సంఘం ఎస్ఎఫ్ఐ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు పి.వరహలు, ఎమ్.గంగాసూరిబాబు, రాష్ట్ర నాయకులు రవి, అక్బర్, అశోక్, గోపాల్, ఆదర్శ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం మున్సిపల్ మిగులు బడ్జెట్ రూ.574.95 లక్షలు - ఆమోదించిన కౌన్సిల్

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : శనివారం పెద్దాపురం పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ డిఇ ఆదినారాయణ ఆధ్వర్యంలో బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రెండవ వైస్‌చైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీలు మాట్లాడుతూ పారిశుద్యం, త్రాగునీటి సరఫరాపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ అధికారులు ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది. అనంతరం జరిగిన కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు మాట్లాడుతూ బడ్జెట్‌పై పలు అంశాలను చర్చించారు. అలాగే పట్టణంలో నెలకొన్న పలు సమస్యలపై కౌన్సిల్ సభ్యులు విడదాసరి రాజా, విజ్ఞపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్‌లు మాట్లాడారు. పట్టణంలో అక్రమ బిల్డింగ్‌లు, అనధికార కట్టడాలు పెరుగుతుంటే మున్సిపల్ యంత్రాంగం ఏం చేస్తుందని, కౌన్సిలర్ విజ్ఞపు రాజశేఖర్ ప్రశ్నించారు. పన్నుల వసూళ్ళకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని, కౌన్సిలర్ ఆరెళ్ళ రాఘవ తెలిపారు. ప్రస్తుత సీజన్‌లో వస్తున్న సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని కౌన్సిలర్లు సూచించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలను లేవనెత్తడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు గోకేడ అప్పారావు, కట్టా రాజాబాబు, తాటికొండ వెంకటలక్ష్మి, బొబ్బిలి వీరవెంకట దుర్గ, పలువురు కౌన్సిలర్లు, మేనేజర్ యు.జ్యోతిరాణి, ఆర్వో చంద్రశేఖరం, ఏఇ కృష్ణ జీవ ప్రసాద్, ఆర్ఐ సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ సుభాషిణి, సి1 బత్తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

శృంగార వల్లభ స్వామి దర్శనానికి పాటెత్తిన భక్తులు

పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యల

సోమవారం స్పందన రద్దు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతీ సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న డివిజన్ స్థాయి జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం నూతన సంవత్సరం వేడుక సందర్భంగా జనవరి 1న స్పందన రద్దు చేయడం జరిగినట్లు పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో భాగంగా తెలిపాయి. కావున అర్జీదారులు ఈ విషయం గమనించాలని సూచించారు.

సూరవరపు జయసాయి రజితకు డాక్టరేట్ ప్రధానం -వీసీ ఆచార్య కె.పద్మరాజు

రాజానగరం, మేజర్ న్యూస్ : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు సూరవరపు జయసాయి రజితకు డాక్టరేట్ ప్రధానం చేసి అభినందించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ లో చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రత్న మాణిక్యం పర్యవేక్షణలో జయసాయి రజిత "ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి జిల్లాల్లోని ఉపాధి ఎంపిక పరిశ్రమలపై వాతావరణ మార్పు అనుకూలత ప్రభావం" అనే అంశంపై పరిశోధన చేసారు. పర్యవేక్షకులు ఆచార్య కె రత్న మాణిక్యం మాట్లాడుతూ చక్కటి అభిరుచితో నేటి సమాజానికి ఎంతో కీలకమైన అంశంపై అధ్యయనం చేసారని, దీనికి సబ్జెక్ట్ ఎక్స్పర్ట్ గా ఆచార్య డి సూర్యచంద్రరావు వ్యవహరించారని అన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ సూరవరపు జయసాయి రజిత ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సిడిసి డీన్ ఆచార్య కె శ్రీ రమేష్, కామర్స్ అండ్ మేనేజ్మెంట్ హెచ్ ఓ డి, బి.ఓ.ఎస్. చైర్మన్ డాక్టర్ ఎన్ ఉదయభాస్కర్, ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె సుబ్బారావు వివిధ శాఖల సహాయ ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు రజితను అభినందించారు.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఎం.గంగా సూరిబాబు, పి.వరహాలు, చిన్ని

కాకినాడ, మేజర్ న్యూస్ : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆంధ్రప్రదేశ్ 24వ రాష్ట్ర మహాసభలు కాకినాడ నగరంలో ఈనెల 27, 28,29 తేదీల్లో అంబేద్కర్ భవన్‌లో నిర్వహించడం జరిగింది. ఈ మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీని 55 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో కాకినాడ జిల్లా నుండి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబు ను మరియు జిల్లా కమిటీ సభ్యురాలు చిన్ని ను రాష్ట్ర కమిటీలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ముగ్గురు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం పరిరక్షణ కోసం జిల్లాలో ఉన్న విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాన్ని చేస్తామని, జిల్లాలో ఉన్న సమస్యలపై రాష్ట్ర కమిటీలో చర్చించి రాష్ట్రస్థాయి పోరాటం నిర్మిస్తామని అన్నారు. జిల్లా నుంచి ఎన్నికైన ముగ్గురు సభ్యులకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరఫున విప్లవ అభినందనలు తెలియజేశారు.

విజయవంతంగా ముగిసిన వికసిత భారత్ సంకల్పయాత్ర

చింతూరు, మేజర్ న్యూస్ : చింతూరు మండలంలో విజయవంతంగా వికసిక్ భారత్ సంకల్పయాత్ర శనివారం తుమ్మల గ్రామపంచాయతీ, లచ్చిగూడెంలో వికసిత్ భారత సంకల్పయాత్ర ముగిసింది. చింతూరు మండల బిజెపి కన్వీనర్ డి.వి.ఎస్.ఎస్.ఎన్.రమణారెడ్డి ఆధ్వర్యంలో లచ్చిగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చిట్టిబాబు మాట్లాడుతూ ఒక వికసిక్ భారత సంకల్పయాత్ర సుమారుగా తొమ్మిది రోజులపాటు రోజుకు రెండు గ్రామపంచాయతీలు చొప్పున మన నరేంద్ర మోడీ ప్రవేశపెట్టినటువంటి ప్రతి ఒక్క సంక్షేమ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ప్రతి ఒక్క గ్రామ పంచాయతీల్లో సంక్షేమ పథకాలు వివరిస్తూ యాత్ర కొనసాగడం జరిగిందన్నారు. చింతూరు మండలానికి పిఎం కిసాన్ నిధి నుండి 2,800 మంది రైతులు లబ్ధిదారులు ఉండగా ఒక సంవత్సరానికి 6 వేల రూపాయలు చొప్పున ఇప్పటివరకు మూడు దపాలాలుగా సుమారుగా 50 కోట్ల నాలుగు లక్షల రూపాయలను చింతూరు మండలానికి నరేంద్ర మోడీ ఇవ్వడం జరిగిందన్నారు. ఉజ్వల గ్యాస్ పంపిణీ పథకం ద్వారా చింతూరు మండలంలో ఉన్నటువంటి లబ్ధిదారులు ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుందన్నారు. ప్రతి గిరిజన లబ్ధిదారుడికి తన సొంత ఇల్లు కట్టుకోవడానికి 2,30,000 రూపాయలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ పురం మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, ఓబీసీ జిల్లా జనరల్ సెక్రెటరీ పంబి భూపేష్, జిల్లాశాఖ కిసాన్ మోర్చ నాయకులు శోడి రమేష్, నోముల సత్య నారాయణ పాల్గొన్నారు. కూనవరం నాయకులు కూనవరం టౌన్ ప్రెసిడెంట్ కుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రవేశపెట్టినందుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

- ఎమ్మెల్యే చినరాజప్ప మద్దతు

పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, పండుగ సెలవులు, వారంతపు సెలవులు అమలు చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వాలని, ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో శనివారంకు 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సమ్మెకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి రోడ్లు శుభ్రం చేసే కార్మికులకు న్యాయం చేయాలని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకువెళతానని, ప్రస్తుత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి లేఖను రాస్తానని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే వెంట పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వర్రే గిరిబాబు, ఈశరపు దుర్గాప్రసాద్, సింగంపల్లి సింహాచలం, ముత్యాల దుర్గ, వర్రే భవాని, మడికి మోహనరావు, దొండపాటి శేషారావు, యాసలపు శ్రీకాంత్, వర్రే రాజేష్, కె.వి.రమణ, బాసిన భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ లేకుండా సమావేశాలు

- అర్ధాంతరంగా ముగిసిన కోట కౌన్సిల్ సమావేశం

సామర్లకోట, మేజర్ న్యూస్ : నెలకి ఒకసారి నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి మున్సిపల్ కమిషనర్ హాజరు కాకుండా ఉండటం ఏంటని అధికార పార్టీ కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీనారాయణ నేతల హరిబాబు రెడ్డి సునీత ప్రశ్నించారు. శనివారం సామర్లకోట మున్సిపల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి అధ్యక్షతన సాధారణ ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సీఎం పర్యటన నిమిత్తం జిల్లా కలెక్టర్ నిర్వహించే సమావేశానికి కాకినాడ వెళ్లడంతో ఆయన స్థానంలో మున్సిపల్ మేనేజర్ అచ్యుతరాజుకు బాధ్యతలు అప్పగించారు సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు ఆవాల నేతల మాట్లాడుతూ నెలకు ఒకసారి నిర్వహించే కౌన్సిల్ సమావేశానికి అధికారులు లేనప్పుడు సమావేశాలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఇప్పటికే ప్రజా సమస్యలు కౌన్సిల్ సమావేశంలో చెప్పిన పరిష్కారం కావడం లేదని విస్మయం వ్యక్తం చేశారు కమిషనర్ బాధ్యతగా కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాలని ఆయన లేకపోతే ప్రత్యేకంగా వేరే ఒక రోజు ఏర్పాటు చేయాలని అన్నారు. దీనిపై చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ బదులిస్తూ కమిషనర్ అర్జెంటుగా సమావేశానికి వెళ్లాల్సి ఉన్నదని తనకు చెప్పారని ఇకనుండి కమిషనర్ ఉన్నప్పుడు సమావేశం నిర్వహిస్తామని సభకు హామీ ఇచ్చారు. అనంతరం ఎజెండాలోని కొన్ని అంశాలపై గౌరవ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు 2018లో మున్సిపాలిటీకి సరఫరా చేసిన జిమ్ తాలూకా ఐటమ్స్ నిమిత్తం బిల్లులు కౌన్సిల్ ఆమోదించి బిల్లులు పంపాలని ఏజెండాలోని మొదటి అంశంగా ప్రతిపాదించగా దానికి 2018 లో చేసిన బిల్లులు ఇప్పుడు ఎలా చెల్లిస్తామని కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ నేతల రెడ్డి సునీత పిట్ట సత్యనారాయణ తదితరులు అన్నారు దీనిపై మున్సిపల్ మేనేజర్ అచ్యుత్ రాజు మాట్లాడుతూ

ప్రభుత్వానికి చెల్లించాల్సిన బిల్లులపై 2018 ఉత్తర్వులు ప్రకారం కౌన్సిల్ ఎజెండాలు పొందుకొచ్చావని ఇది అత్యంత త్వరగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించాల్సి ఉందని ఆమోదించాలని విజ్ఞప్తి చేశారు. అయితే సభ్యులు దీనికి అంగీకారం తెలుపలేదు 23వ వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని త్రాగునీరు సమస్య తీవ్రంగా ఉందని తక్షణం పరిష్కరించాలని 23 వార్డ్ కౌన్సిలర్ పితాని కృష్ణ డిమాండ్ చేశారు దీనిపై సంబంధిత మున్సిపల్ ఏఈ అనంతలక్ష్మి త్వరలో చేపడతామని చెప్పడంతో దీనిపై అధికార పార్టీ కౌన్సిలర్ పితాని కృష్ణ అభ్యంతర వ్యక్తం చేశారు ప్రతి సమావేశంలోని ఇలాగే చెప్తున్నారని కృష్ణ వాకౌట్ చేశారు సమావేశంలో ఒకటి పదోవ అంశాలు వాయిదా వేయలని మిగతా అంశాలతో మాకు అభ్యంతరం లేదని కౌన్సిలర్లు తమ అనుకూలమైన అంశాలను ఆమోదింప చేసుకుని సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించి వెళ్ళిపోయారు కౌన్సిలర్ కరణం రాజకుమార్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయి వీటిని నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కరణం రాజకుమార్ డిమాండ్ చేశారు ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు తెలుగుదేశం కౌన్సిలర్లు బలుసు వాసు పాల్గొన్నారు.

ఆదిత్యలో అంబరాన్ని అంటిన "మిలాన్-2K23" సంబరాలు

- ఆదిత్య కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక

గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెం ఆదిత్య విద్యా ప్రాంగణంలో ఆదిత్య సిబ్బంది కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం మిలాన్ -2K23పేరిట నిర్వహించిన గెట్ టు గెదర్ కార్యక్రమం ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో ఆనందోత్సాహాలతో సాగింది.. ఆదిత్య క్యాంపస్ నందు గల ఇంజనీరింగ్ ఫార్మసీ పాలిటెక్నిక్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాలలకు చెందిన టీచింగ్ టెక్నికల్ నాన్ టీచింగ్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆదిత్య యాజమాన్యం మిలాన్ పేరిట ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు అనేక రకాల చిరుతిండ్లు తో పాటు అనేక బహుమతులు అందిస్తూ... ప్రారంభమైన కార్యక్రమంలో ఆదిత్య సంస్థ నందు ఉద్యోగంలో చేరిన వివిధ విభాగాలలో గత 15 సంవత్సరాల అంతకు పైబడి సేవలందిస్తున్న సిబ్బంది కి గత మిలాన్ కార్యక్రమంలో ఘనంగా సన్మానించిన సంగతి విదితమే.. అదే విధంగా గత 12సంవత్సరాలుగా సేవలందిస్తున్న మరికొంత మందికి ఈ సంవత్సరం మిలాన్ సందర్భంగా సత్కరించారు. నిత్యం వారి వారి పనులతో బిజీ బిజీగా గడిపే ఆదిత్య సిబ్బంది వారి కుటుంబ సభ్యుల ఆటపాటలతో డాన్స్ ప్రోగ్రామ్స్ తో కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఆనంద భరితంగా ఉత్సాహపూరిత వాతావరణంలో మిరుమిట్లుగొలిపే విద్యుత్ కాంతుల నడుమ సంక్రాంతి పండుగ ను మించి జరిగింది. గత 23 సంవత్సరాలు గా క్యాంపస్ దినదినాభివృద్ధి గాంచిన విధానాన్ని వివరిస్తూ ఏర్పాటుచేసిన ఫోటో ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. ఫోటో ప్రదర్శనలో పాల్గొన్న ఆదిత్య అధినేత డా. నల్లమిల్లి శేషారెడ్డి గారు అప్పటి పరిస్థితులు గుర్తుచేసుకొని నాటి సంగతులను చెప్పిన విధానం ఎంతో సంభ్రమాశ్చర్యాలు కలుగజేసింది. ఈ సందర్భంగా ఆదిత్య సిబ్బందిచే ప్రదర్శించిన స్కిట్ లు,సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. చలిని సైతం వేడెక్కించే లా సాగిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు,ఎంతో ఉత్సాహాన్ని కలిగించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా జె.ఎన్.టి.యు.కె కాకినాడ రెక్టార్ డా.కె.వి.రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేసిన డా. శేషారెడ్డి మాట్లాడుతూ ఆదిత్య విజయపరంపర లో సిబ్బంది సహకారం ఎంతో ఉంది అని అన్నారు. అత్యుత్తమ సంస్థ గా ఆదిత్య నిలిచింది అంటే రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించింది అంటే అందుకు ఆదిత్య సిబ్బంది కృషి ఎంతో ఉంది. వారికి వారి కుటుంబ సభ్యులకు నమస్సుమాంజలులు తెలియజేస్తున్నాను అన్నారు. డా. సతీష్ రెడ్డి మాట్లాడుతూ తమ సిబ్బంది అత్యుతమ సహకారం అందించి సంస్థ మనుగడకు తోడ్పాటు అందిస్తున్నారని వారి సహకారం వల్లే అత్యధిక శాతం ప్లేసెమెంట్ లు సాధించగలుగుతున్నామని, 90 శాతానికి పైబడి అడ్మిషన్లు పొందగలుగుతున్నామని అన్నారు. ముఖ్య అతిథులు డా.కె.వి.రమణ మాట్లాడుతూ ఆదిత్య విద్యాసంస్థలు ఏ కార్యక్రమం అయినా వినూత్నంగా భారీగా చేయడం పరిపాటి అని ఇటువంటి కార్యక్రమం సిబ్బందిలో నూతన ఉత్సాహాన్ని భాద్యతను పెంచుతుందని అన్నారు అత్యుతమ విలువలతో కూడిన విద్యను అందించే సంస్థ ఆదిత్య రాష్ట్రస్థాయిలో పేరు పోందిందింది అని డా. శేషారెడ్డి గారి కృషి వారి తనయులు డా. సతీష్ రెడ్డి గారు దాన్ని కొనసాగించే విధానం అంతకు మించి నూతన ఆలోచనలతో సంస్థ అభివృద్ధికి సిబ్బంది ని సొంత కుటుంబంలా చూసుకునే వాత్సల్య పూర్వక విధానం అద్భుతం అని ఈ సంస్థ మరింత అభివృద్ధి పథంలో సాగాలని కోరారు.టి.నీలిమ,సుధారాణి బృందం యాంకరింగ్ తో కార్యక్రమాలు అద్యంతం ఎంతో ఉత్సాహంగా సాగాయి.ఈ కార్యక్రమంలో ప్రాంగణం లో గల అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ , డీన్ లు,వివిధ విభాగాల అధిపతులు ఉపాధ్యాయ, ఉపాద్యాయేతర సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. సన్మాన కార్యక్రమం అనంతరం పసందైన విందు తో కార్యక్రమం ముగిసింది.

పోటీ పరీక్షలలో సమయానుకూలంగా వ్యవహరించాలి.. జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం, మేజర్న్యూస్ : పోటీ పరీక్షలలో విజయం సాధించడం కోసం నిశిత పరిశీలన, సరైన సమయంలో స్పందించడం ద్వారా ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వడం ద్వారా మెరుగైన ర్యాంకు సాధించడం సాధ్యం అవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ పేర్కొన్నారు.శనివారం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉన్న బిసి స్టడీ సర్కిల్ ను సందర్శించి గ్రూప్ 2 అభ్యర్థులకు మోటివేషన్ తరగతులలో పాల్గొన్నారు. ఈ సందర్భ%శీ%గా జేసీ తేజ్ భరత్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాలకు చెందిన యువతకు మెరుగైన భవిష్యత్ అందచేసే క్రమంలో బిసి స్టడీ సర్కిల్ ద్వారా మెరుగైన శిక్షణ వసతులు కల్పించడం జరుగుతోందని అన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తీసుకోవలసి జాగ్రత్తలు పాటిస్తే తప్పకుండా విజయం సాధ్యం అవుతుందన్నారు. గ్రూప్ వన్ కోసం రెండు సార్లు పోటీ పరీక్షలలో పాల్గొని విజయం సాధించిన తీరును వివరించారు. పోటీ పరీక్షలలో ప్రతి ఒక్క ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని, అదే సమయంలో సమయ పాలన ప్రకారం అన్ని ప్రశ్నలకు నిర్ణీత సమయం లో జవాబులు రాసేలా ప్రాక్టీస్ చెయ్యాల్సి ఉంటుందన్నారు.

ఈ స్టడీ సర్కిల్ ద్వారా 100 మంది యువతకు శిక్షణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లక్ష్యాలను సాధించడానికి నిర్దిష్ట ప్రణాళికలు కీలకం అన్నారు. ఈ మోటివేషన్ కార్యక్రమంలో మేడిసెట్టి తాతబ్బాయి, బిసి సంక్షేమ, బీసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి ఎస్ రమేష్ తదితరులు హాజరయ్యారు.

ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్‌గా సందీప్

ఆలమూరు, మేజర్ న్యూస్ : ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్ గా ఆలమూరు మండలం కలువచర్ల గ్రామానికి చెందిన తాతపూడి సందీప్ కుమార్ ఎంపికయ్యారు. యూకేజీ నుండి పదవ తరగతి వరకు స్థానికంగానే చదివిన సందీప్ పాలిటెక్నికల్, పెట్రోలియం కెమికల్ ఇంజనీరింగ్, ఆంధ్ర యూనివర్సిటీలో బీటెక్ ఫస్ట్ ర్యాంక్ సాధించి న్యూఢిల్లీలో ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సైంటిస్ట్‌గా ఉద్యోగం సాధించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి అబ్బులు వీఆర్వోగాను, తల్లి సుశీల అంగన్వాడి టీచరుగా విధులు నిర్వహిస్తుండగా, కుమారుడు సెంట్రల్ గవర్నమెంట్ లో మంచి ఉద్యోగం సాధించినందుకు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సందీప్‌ను ఆలమూరు మండలంలోని పలువురు ప్రముఖులు అభినందించారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన ప్రవీణ్, ప్రత్యూష దంపతులు

రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : బంగారుకొండ రేలంగి ఇవాంశిక తల్లి తండ్రులు ప్రవీణ్, ప్రత్యూషలు శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ డా కె. మాధవీలత ను కలిసి కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత బంగారుకొండ ఇవాంశిక యొక్క ఎదుగుదల, ఆరోగ్య పరిస్తితి పై ఆరా తీశారు. జిల్లాలో అధికారులు , ప్రజా ప్రతినిధులు, ఔత్సహిక ల చొరవతో తీవ్ర పోష్టి కాహర లోపం, వయస్సుకు తగ్గ ఎత్తు , బరువు లేని పిల్లలను గుర్తించి వారికి ప్రభుత్వం అందిస్తున్న వైయస్ఆర్ కిట్స్ కు అందనంగా బంగారు కొండ కిట్స్ పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆ క్రమంలో ఇవంసినా ను దత్తత తీసుకుని, ప్రతి బుధవారం పాప యొక్క పురోగతిని పర్యవేక్షించడం జరిగిందన్నారు. ఆ క్రమంలో ఆరు నెలల కాలంలో పూర్తి స్థాయి సాధారణ స్థితికి రావడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన బంగారుకొండ తొలిదశలో 1283 మంది పిల్లలను దత్తత తీసుకుని 70 శాతం మంది సాధారణ స్థితి కి చేరుకునే క్రమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అభినందనీయం అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ కుమార్తె రేలంగి ఇవాంశిక విషయంలో కలెక్టర్ మాధవీలత వ్యక్తిగత శ్రద్ధ తీసుకొని మరెందరికో స్ఫూర్తిగా నిలిచారని ప్రవీణ్ పేర్కొన్నారు

డిసెంబర్ 31 వేడుకలు కుటుంబసభ్యులతో జరుపుకోవాలి

- ఎస్సైలు వెంకయ్య, రఘునాథరావు

రాజవొమ్మంగి,మేజర్న్యూస్:మండల పరిధిలోని ఈనెల 31న రాత్రి నిర్వహించే సంబరాలు కుటుంబ సభ్యులతో జరుపుకోవాలని రాజవొమ్మంగి,జడ్డంగిఎస్సైలుఎస్ వెంకయ్య, రఘునాధరావులు కోరారు. జిల్లాలోనిరంప చోడవరం డివిజన్ రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోనిరాజవొమ్మంగి ఎస్సై ఎస్. వెంకయ్య, జడ్డంగి ఎస్ఐ రఘునాథ రావులుమండల ప్రజలకు రాబోయే నూతన సంవత్సర వేడుకల పట్ల పలు జాగ్రత్తలు, సలహాలు,హెచ్చరికలు చేశారు. తొలి తగ మండల ప్రజలందరికీ ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలకు ముందు 2023 డిసెంబర్ 31న రాత్రి ప్రజలుసంబరాలు చేసుకునే సమయంలో సుఖ సంతోషాలతో కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించుకోవాలన్నారు.రోడ్లపై బహిరంగంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.. మద్యం సేవించి రోడ్లపై తిరగడం, అతి వేగంగా వాహనాలు నడపడం వంటిచట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హోటల్లు, డాబాలు నిర్వాహకులు 31 అర్ధరాత్రి వరకు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.యువకులు రోడ్లపై బైకులకుసైలెన్సర్లు తీసివేసి అధిక శబ్దంతో తిరిగిన లేక రోడ్లపై పటాకులు పేల్చిన పోలీసులు అదుపులోకి తీసుకొని చట్టరీత్య చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల ప్రజలు డిసెంబర్31, జనవరి 1పర్వదినాలను పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా కుటుం బంతో సంతోషంగా గడుపు కొని ఆనందించాలనిఎస్సైలు వెంకయ్య, రఘునాధ రావులు కోరారు.

సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొవ్వూరు,మేజర్న్యూస్ :కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం తాడిపూడి ఎత్తిపోతల పథకంలో ఆప్కాస్ ద్వారా నూతనంగా నియమించబడిన ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, హెూం మరియు విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత లపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్వహణ కోసం %ఔరాజూరా% ద్వారా అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నియమించిన 27 మంది స్థానిక కొవ్వూరు హెూంమంత్రి వారి క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞత లు తెలిపారు. అనంతరం హెూంమంత్రి చేతుల మీదుగా కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. సీఎం వైయస్ జగన్ హెూం మంత్రి తానేటి వనిత చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించడానికి విశేష కృషి చేసిన రాష్ట్ర హెూంమంత్రి, కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తానేటి వనిత మేలు ఎప్పటికీ మర్చిపోలేమని ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రాథమిక సదుపాయాలు ఉండాలి

శత శాతం ఖచ్చితమైన ఓటర్ల జాబితా రూపొందించాలి..జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం,మేజర్న్యూస్ :జిల్లాలో గల అన్ని పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులైన తాగు నీరు, టాయిలెట్లు, రాంప్ లు, లైట్స్, తదితర ప్రాథమిక సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. వచ్చే మూడు రోజుల్లో సెక్టరల్ అధికారులు, ఎఈఆర్ ఓలు ప్రతి పోలింగ్ స్టేషన్ ను తనిఖీ చేసి ప్రస్తుతం ఉన్నటువంటి మౌలిక వసతుల పై వాస్తవమైన, ఖచ్చితమైన నివేదికను జనవరి 4 వ తేదీ నాటికి అందించాలని సూచించారు. శనివారం ఎన్నికల ఆర్.ఓ లు, ఈ ఆర్ ఓ లు, సెక్టరాల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 4లోగా ఈఆర్ఓ లాగిన్ లో అప్లోడ్ చేయాలని, అలా అప్లోడ్ చేసిన నివేదికను బట్టి ఏ ఏ పోలింగ్ స్టేషన్ కు ఏ ఏ అవసరాలు ఉన్నాయో గుర్తించి నిధులను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నివేదిక ఎన్నికల కమిషన్ కు పంపడం జరుగుతుందని, పూర్తి వెరిఫికేషన్ అనంతరం వాస్తవ రిపోర్ట్ అప్లోడ్ చేయాలని తెలిపారు.

ఎలాంటి అవసరాలు లేవని, అన్ని వసతులు ఉన్నాయని భావిస్తే ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లే భావించడం జరుగుతుందని, ఆఖరి నిమిషం లో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని సూచించారు. 80 శాతం పైబడి పోలింగ్ స్టేషన్లు ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నందున సదుపాయాల కల్పనకు అవసరమయ్యే నిధులను